"మా ఊళ్ళో పదిన్నరైనా ఇంతే తెల్లారుతుందిలే? ఇప్పుడింక ఈ ఊళ్ళో సూర్యుడిని తిట్టిపోస్తావా? లేలే! నిద్రపోయేందుకా ఇంతదూరం వచ్చావు?" అని పాపాయ్‌ని నా మంచం మీద కూలేసి వెళ్ళిపోయింది.

కాసేపు పాపాయితో ఆడుకుని దాన్నెత్తుకుని నెమ్మదిగా హాల్లోకి వచ్చాను. మా అత్తగారు డైనింగ్ టేబుల్ దగ్గర కూచుని దాని మీదున్న నీళ్ళ జగ్గుని చూస్తూ తనకి కంఠోపాఠం అయిన అష్టాదశ అష్టకాల్లో ఒకదాన్ని చదువు తున్నారు. "అదేవిటీ! అలా జగ్గుకేసి చూస్తూ ఆ పారాయణం ఏమిటి? శైలు నడిగి ఏదైనా దేవుడి పటం పెట్టుకోకపోయారా?" అనడిగాను.

"అడిగా! అదీ 'ఇక్కడ అణువణువులో దేవుడున్నాడు! కళ్ళు మూసుకు చదువుకో' అని సలహా ఇచ్చింది!" అని తన పారాయణం కంటిన్యూ చేసుకో సాగారు.

'మా ఇంట్లో మనుషుల గురించి కొత్తగా తెలుసుకోవలసిందేవుందిలే' అని నిట్టూర్చి మా ఆయనెక్కడున్నారు చెప్మా అని అటూ ఇటూ చూశాను. ఎక్కడా కనిపించకపోయేటప్పటికి కిటికీలోంచి బయటకు చూశాను. ఎంచక్కా మా ఊళ్ళో మాలీకి మల్లేనే ఓ మఫ్లరూ, టోపీ పెట్టుకుని, పాతస్వెట్టరు (బహుశా మా అల్లుడిదేమో) వేసుకుని రెండు బస్తాల గడ్డి మేటేస్తున్నారు. ఆహా! దేశ కాల వాతావరణ పరిస్థితులతో సంబంధం లేకుండా ఏదో ఒక పనిని కనిపెట్టి చేసుకుపోగల ధీరోదాత్తులం కదా అని ఒక్క క్షణం నా మనస్సు పులకించిపోయింది. చంటిది నేను దానికేసి చూసినప్పుడల్లా 'నో! నో!' అని అరుస్తూ, నేను చూడనప్పుడు దాని లోకంలో అది ఆడుకుంటోంది. ఇంక నాకు ఏవిటో ఆక్సిజన్ తక్కువైనట్లు, ఊపిరాడనట్లు, ఉక్క ఉక్కగా, వేడిగా అనిపించసాగింది. పొద్దున్నే హాయిగా ఉండాల్సి ఉండగా ఇలా అనీజీగా ఉందే విటి? మరి మా ఆయన ఈ మఫ్లరూ స్వెటరూ స్టైలేవిటబ్బా. ఇక్కడ అలా వేసుకోవాలని ఎవరైనా చెప్పారేమో! ఒకసారి పలకరించివద్దాం. లేకపోతే కూతు రింటికి వచ్చాక తనని మర్చిపోయానని అలిగినా అలుగుతారు మహాను భావులు!

బయటకెడదామని అద్దాల వీధి తలుపు తీశాను! కొట్టింది హిందీ సినిమాలో లాగా దయ్యం మ్యూజిక్‌తో సహా మొఖం మీదకి చల్లటి గాలి! ఒక్కసారి వళ్ళంతా చచ్చుపడ్డట్లయిపోయింది. అప్పుడు తట్టింది నా మొద్దు బుర్రకి. ఇల్లంతా ఎయిర్‌కండిషన్డ్ కాబట్టి వెచ్చగా ఉంది గానీ ఆ వెచ్చదనం

సహజమైనది కాదూ అని. షూస్, సాక్సూ, స్వెట్టరూ వేసుకుని గానీ బయటకు అడుగుపెట్టలేకపోయాను. ఇలా ఇరవై నాలుగ్గంటలూ ఎయిర్ కండీషనర్ సాయంతో గడపాలంటే ఇవి వాసయోగ్యమైన ఊళ్ళు కావు అని మన పూర్వీకులే తేల్చివేసేవారు కదా! అఫ్‌కోర్స్! కరెంటు సప్లై చేయలేక ఇప్పటి ప్రభుత్వాలు వంత పడేవనుకోండి! ఇలాటి ముక్కలు నాలో నేననుకోవాల్సిందే కాని పైకన్నానంటే అన్నం కూడా పెట్టదు మా పిల్ల.

ఆదివారం కదా ఎట్టైనా వెళ్ళొచ్చు అని చెప్పి ఉప్మాచేసి బల్లమీద పెట్టి వంట ప్రయత్నంలో పడ్డాను. కాప్సికం తరిగి పోపులో వేసి దాని మొహాన నువ్వుల పొడి చల్లనా, ఉల్లికారం పెట్టనా అని చాలా సీరియస్‌గా ఆలోచించు కుంటూ ఎదురుగా ఉన్న మా అమ్మాయిని ఎరక్కపోయి అడిగాను. "ఓ పని చెయ్యి! ముందు ఉల్లికారం పెట్టి కాసేపాగి నువ్వులపొడి వేసేయ్! ఎవరికి ఇష్టమైంది వాళ్ళు ఊహించుకుంటార'ని బ్రహ్మాండమైన సలహా ఇచ్చింది.

ఇంతట్లోకి పెరటి గుమ్మంలోంచి "హాయ్ మామ్! వాట్స్‌కుకింగ్? దిసీస్ కారెన్" అంటూ మాట వినిపించింది. వెనక్కి తిరిగి చూశాను. ఆరడుగుల పొడగరి, అమెరికన్ ఆదివారపు సంప్రదాయ దుస్తుల్లో మెరిసిపోతోంది. కళ్ళు తిప్పుకోలేనంత చక్కనిది. నన్ను చూడగానే చేయందించింది. గులాబీ రంగు తామర పువ్వుల్లా ఉన్నాయి చేతులు. "నైస్ మీటింగ్ యూ కారెన్" అని అంటూ తనని డైనింగ్ టేబుల్ దగ్గరకి తీసికెళ్ళాను. మా అత్తగారిని పరిచయం చేశాను." ఈ పిల్ల నాకెందుకు తెలియదూ! "నీకేం కావాలో చెప్పవే అమ్మా! అని మనం మనమ్మాయికి ఫోన్ చేస్తే 'కారెన్‌కి గాజులు తీసుకురా, కారెన్‌కి చున్నీలు తీసుకురా, కారెన్‌కి జీడిపప్పు పాకం తీసుకురా!' అని ఆర్డర్లేస్తుందిగా! ఈ అమ్మాయికే నన్న మాట. పిల్ల బాగుందీ!" అంటూ కాంప్లిమెంటిచ్చారు. తన పిల్లలెలాగున్నారని సంజ్ఞలతో కుశల ప్రశ్నలేశారు. వస్తారని తనూ సంజ్ఞ లతో సమాధాన మిచ్చింది. అక్కడ అత్తగారూ, మా అమ్మాయీ, అల్లుడూ టిఫిన్లు తింటుంటే తనూ వాళ్ళతో కూచుని ఒక్కొక్కళ్ళ ప్లేట్లోంచి స్పూను, స్పూను ఉప్మా తింటూ కబుర్లలో పడిపోయింది. 'చూశావా మా పక్కింటి పిన్నిగార్ని" అని అంటూ మా అమ్మాయి నవ్వడం మొదలుపెట్టింది. ఇంత చక్కని పిల్లని పట్టుకుని పిన్నిగారంటావేవిటే పల్లదనానికైనా హద్దుండాలి అని అచ్చ తెనుగులో కేకలేశాను.

"పిన్నిగారి హోదాకీ చక్కదనానికీ సంబంధం లేదు. నాలుగు రోజులాగితే నీకే తెలుస్తుందిలే నేనాపేరు ఎందుకు ఎట్టానో! అయినా పక్కింటి పిన్ని గార న్నాను గానీ పక్కింటి లావుపాటి పిన్నిగారనలేదుగా!" అని మళ్ళీ నవ్వసాగింది. ఇంక ఆ డైనింగ్ టేబుల్ మీద డేరా వేసిన వాళ్ళు ఏ వేళకీ కదలరు! ఈలోగా నేను వంటచేయడం, స్నానం చేయడం కూడా అయిపోయాయి. ఇంక అప్పుడు వచ్చారు. ఆమెని ఇంటికి తీసికెళ్ళడానికి ఒక రెండేళ్ళ పాప, అయిదేళ్ళ పాప, ఆ వెనక ఆ పిల్లల తండ్రీ. వాళ్ళింటికీ మన ఇంటికీ మధ్య ఓ కాంపౌండ్ వాల్గానీ, ఓ దడిగానీ లేవు. అమెరికాలో చాలా ఇళ్ళకి అంతేనని తరవాత తెలి సిందనుకో! వాళ్ళ వంటింటి నుంచి మన వంటింటి దాకా చక్కని టైల్సు, పరిచిన నడక దారుంది. వాటిమీద పిల్లలు పరిగెడుతునే ఉంటారు. బెల్లు నొక్కడమూ, రావచ్చా అని అడగడమూ లాంటి మర్యాదలేవీ వాళ్ళు పాటిస్తు న్నట్లు లేరు.

కారెన్ భర్త పేరు 'ఎడ్'ట. ఎంత బాగున్నాడో! అచ్చు మన హిందీ సినిమా హీరో అమీర్ఖానల్లే మంచిగా మర్యాదగా ఉన్నాడు. ఇంటికి రమ్మని పిల్లలు పేచీ పెట్టడంతో తప్పని పరిస్థితుల్లో బయలుదేరింది. అప్పుడు మా అమ్మాయి "అమ్మా! నీకు కారెన్ ఓ డీల్ పెడుతోంది. నువ్వుగానీ రోజూ నువ్వు చేసే కూరని తనకి పెడితే, నిన్ను తనకి వీలైనప్పుడు రెండు గంటలు ఊరంతా తిప్పుతుందిట. నీ కిష్టమైతే చెప్పు!" అంది. అదేదో బాగానే ఉంది అనిపించి సరేనన్నాను. ఎందుకంటే మా అల్లుడికీ, అమ్మాయికీ శనాదివారాలు తప్ప ఇంకెప్పుడూ బయటకి తీసికెళ్ళడం కుదరదు మరి. వెంటనే థాంక్యూ అంటూ గట్టుమీద ఉన్న కాప్సికమ్ కూరలో మూడోవంతు బౌల్లో పెట్టుకుని 'రేపు పది గంటలకి రెడీగా ఉండు! నాకు మళ్ళీ 1.30కి పని ఉంది అని చెప్పి "బాయ్ డాడ్!" అంటూ మా ఆయనకో ఫ్లైయింగ్ కిస్ విసిరేసి నా కేసి చూసి కన్ను గీటుతూ వెళ్ళిపోయింది. సిగ్గుపడి తలొంచుకున్న మా ఆయన్ని చూస్తే జాలేసింది పాపం. "ఇప్పుడర్థమైందా నేనా పేరెందుకు పెట్టానో! ఇంకా ముందు ముందు ఎన్ని వేషాలేస్తుందో చూడు! ఆ ఎడ్ చేత ఇంట్లో ఎద్దు చాకిరీ చేయి స్తుంది. ఇదేమో ఊరంతా తిరుగుతుంటుంది" అని మా అమ్మాయి అంది.

"ఏమో! నాకేమీ అర్థం కావటల్లా! ఇక్కడేదో చాలా ఫార్మాలిటీస్ పాటిం చాలీ అమెరికన్లతో ముక్తసరిగా, మర్యాదగా ఉండాలని బోలెడు మెంటల్ ప్రిప రేషన్తో వచ్చా. తీరా చూస్తే ఈ అమ్మాయి మన అమలాపురం నుంచో, అవని గడ్డ నుంచో వచ్చినట్లు ఇంత సరదాగా ఉందంటే నమ్మలేక పోతున్నా"నన్నాను.

"మనుషు లెక్కడైనా ఒకటేనమ్మా! కొంచెం పద్ధతుల్లు తేడాలుంటాయంతే! నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుందని నువ్వేగా చెప్తావు! మనిషికీ మనిషికీ స్నేహం కుదరాలంటే దేశమాతలేం అడ్డుపెట్టరు. మేమే మహానుభావులం. మిగతా అందరూ జారులూ చోరులూ అనుకుంటేనే ప్రమాదం" అని ఆ అమెరికా భక్తురాలు నాకొక ఉపన్యాసం దంచింది.

"మరి మన దేశంలో పాములూ, సాములార్లూ తప్ప ఇంకేమీ ఉండవని ఇక్కడి వాళ్ళనుకోవచ్చేం" అని నేననగానే నాకొక నమస్కారం పెట్టి మా అమ్మాయి వాళ్ళ నాన్న దగ్గరికి గార్డెన్లోకి వెళ్ళిపోయింది.

ఇంకో గంట తర్వాత వాళ్ళాయననీ, పిల్లల్నీ కార్లో కూచోబెట్టి టాటా చెప్పేసి మళ్ళీ మా పెరట్లో ప్రత్యక్షమైంది కారెన్. ఈసారి ఇంట్లో దాకా రాకుండా అక్కడే మా ఆయనకి గార్డెనింగ్ క్లాసులు మొదలుపెట్టింది. మొత్తం గార్డెన్ పరికరాలెలా వాడాలో చూపించింది. బండి లాగుతూ గడ్డి ఎలా కోయాలో సగం గడ్డి కట్‌చేసి చూపించింది. వాళ్ళిద్దరికీ మంచి స్నేహం కుదిరినట్లుంది. మధ్య మధ్యలో గార్డెన్ టేబిల్ మీదున్న బౌల్‌లోంచి కాప్సికమ్ కూరతింటూ కోక్ తాగుతూ ఒకటే కబుర్లు. కాసేపు కిటికీలోంచి చూసి లోపలికొచ్చేశాను.

అప్పుడప్పుడే చలికాలం వెళ్ళి వసంత ఋతువు ప్రవేశిస్తోంది కదా! ఇంక ఆర్నెల్ల వరకూ రకరకాల పూలమొక్కలు పెంచుకోవడమే అందరి పనీ! ఆది వారం కాబట్టి అందరిళ్ళల్లో పిల్లలూ, పెద్దలూ ఏదో ఓ ఆయుధం పుచ్చుకుని గార్డెన్లల్లోనే. అంటే అంతా క్లీన్ చేసుకోవడం, గడ్డి ట్రిమ్ చేసుకోవడం, స్విమ్మింగ్ పూల్‌ని బాగుచేసుకోవడం ఒకటేవిటీ ప్రతి ఇంటి ముందూ పెద్దా చిన్నా ఆడా మగా తేడా లేకుండా వాళ్ళ ఇంటి పనులు వాళ్ళు చేసుకోవడం ఒక అద్భుత దృశ్యంలా కనిపించింది నాకు. మనకిక్కడ సగం జీవితం పని మనిషి రాలేదనో, చాకలి బట్టలు తేలేదనో బాధపడడానికే సరిపోతుంది.

నెమ్మది నెమ్మదిగా ఆ వాతావరణానికీ, ఒక్క పూట వంట చేసి రెండు పూటలా తినడానికీ, ఇంగ్లీషు ఛానెల్స్‌లో సీరియల్స్‌కీ, పగలంతా పిట్టల చప్పుళ్ళు మాత్రమే వినడానికీ అలవాటు పడడం మొదలుపెట్టాం. ప్రామిస్ చేసినట్లుగానే కారెన్ రోజు విడిచి రోజు పదిన్నరకి వచ్చి నన్ను తన కారులో ఎక్కించుకుని ఊరంతా తిప్పేది. ఒక్కొక్కసారి మా అత్తగారు కూడా నాతో వచ్చేవారు. ఒక్క ఇరవై మైళ్ళు ఊరు బయటకు వెళ్ళామంటే ఎన్ని సెలయేళ్ళు, పచ్చిక బయళ్ళు, లోయలు చూడటానికి రెండు కళ్ళూ సరిపోయేవి కావు. అది

అంత పెద్ద పట్టణమైనా, జనసమ్మర్థం అంతగా లేనిచోట జింకలు లేళ్ళు కనిపించేవి. ఒకరోజు కాలనీ చూపిస్తానని తీసికెళ్ళింది. ఒక్కొక్క ఇంటిముందు నిలబెట్టి ఆ ఇల్లు ఎప్పుడు కట్టారో, ఆ ఇల్లు ఇప్పటికి ఎన్ని చేతులు మారిందో దాని ఆర్కిటెక్చర్ ఏ దేశానిదో చెప్పి ఆ వాకిట్లో ఉన్న చెట్టుకి ఎన్నేళ్ళో అది ఎక్కడిదో ఆ చెట్టు బొటానికల్‌గా ఏ జాతికి చెందిందో చెప్పేది. ఇంటికి రాగానే లాప్‌టాప్ ఓపెన్ చేసి వెబ్‌సైట్‌లోంచి మొత్తం సమాచారమ్మంతా చూపించేది. ఇంక నా అదృష్టం కొద్దీ ఒక పిట్టో, పురుగో, తుమ్మెదో, కందిరీగో కనిపించినా అదే కథ. అసలు ఈ పిల్లకి ఈ ప్రపంచంలో ఉన్న ఎనభై కోట్ల జీవరాశుల మీదా అంత ఇంటరెస్టేమిటో నాకు అర్థం అయ్యేది కాదు.

ఒకసారి వాళ్ళ అమ్మ గారింటికి తీసికెళ్ళింది. అదే కాలనీలో వాళ్ళ మేన మామలవి, దారిలో వాళ్ళ అత్తలవీ అందరూ అక్కడక్కడే మూడు తరాల బంధువుల ఇళ్ళు చూపించింది. తను పుట్టిన హాస్పిటల్, చదువుకున్న స్కూళ్ళు కాలేజీ, పెళ్ళయిన చర్చి, తన మొట్టమొదటి బాయ్‌ఫ్రెండు ఇల్లు, తను ఎడ్‌ని కలుసుకున్న రెస్టారెంటు అన్నీ చూపించింది. ఇవన్నీ చూస్తే నాకు మన అగ్ర హారాలు గుర్తొచ్చాయి. మర్నాడు వాళ్ళ అత్తగారి ఇంటివేపుకి దాడి. వాళ్ళ ఇల్లు ఊరికి చాలా దూరంగా ఇంకో కాలనీ. దారిలో మాకొక చిన్నసైజు అడివీ, సెల యేళ్ళు కూడా కనిపించాయి. వాళ్ళ ఇంట్లో అత్తగారిదే పెత్తనంట. మామగారు చాలా మంచివారుట (అందరిళ్ళల్లో లాగానే). తన చరిత్ర లాగానే వాళ్ళాయనది కూడా చరిత్ర అంతా ఇల్లస్ట్రేషన్స్‌తో సహా చెప్పింది. ఈ అమ్మాయి చెప్పినట్లు గానే వాళ్ళ అత్తగారు ముక్తసరిగా హాయ్ అని పలకరించి లేసు అల్లుకుంటూ కూచుంది. తను మాత్రం ఇల్లంతా చూపించి దొడ్లో ఉన్న టమాటాలు, బీన్స్, సిమ్లా మిర్చి కోసి పెద్ద బుట్టలో వేసుకుని, ఫ్రిజ్‌లో ఉన్న కేకు సగం కోసి పాక్ చేసుకుని 'బాయ్ మామ్' అని చెప్పి బయలుదేరింది. మరి దేశం ఏదైనా తను ఆ ఇంటి కోడలు కదా! అన్ని హక్కులూ ఉంటాయి మరి.

ఇలా తన పుణ్యమా అని ఆ చుట్టుపక్కల కాలనీలు, మామూలు టూరి స్టులు చూడని ఎన్నో అనామకపు ప్రదేశాలు, నిజమైన అమెరికన్ కుటుంబాలు, వాళ్ళ జీవితాలు, సమస్యలు, భయాలు అన్నీ చూడగలిగాను. నాకు అసలు ఏ దేశమెళ్ళినా అక్కడ చెట్లు మనుషులు అంటేనే ఇష్టం. చారిత్రక కట్టడాలని కంప్యూటర్లో అయినా చూసుకోవచ్చు కదా!

........................................

చుట్టాలనబడే వాళ్ళు అక్కడా ఇలాగే ఉంటారు. ఏ దేశమైనా ఫ్రెండ్సే మంచివాళ్ళు. ఫ్రెండ్షిప్‌లో మాటలనడం, వినడం, పడడం ఉండవు కదా! నా కన్నిటికన్నా నచ్చిన విషయమేమిటంటే మంచి కుటుంబాలన్నిటిలో ఆడవాళ్ళ మాటే చెల్లుతుంది. భర్తలు భార్యలని చూసి కాస్త భయపడుతుంటారు. ఇళ్ళల్లో బోల్డు పనులు చేస్తారు. ఎక్కువసార్లు భార్య పుట్టింటికి సంతోషంగాను, అమ్మా నాన్నల దగ్గరకి అప్పుడప్పుడు బాధ్యతగాను వెడుతుంటారు. తల్లులు వయ సొస్తున్న ఆడపిల్లల గురించి దిగులుపడుతుంటారు. ఆరాలు తీస్తుంటారు. బాయ్‌ఫ్రెండ్స్‌ని కేకలేస్తూ ఉంటారు. పిల్లల్ని పట్టుకోవడం కుదరదు. వది లేయడం వల్లకాదు. కారెన్ నన్ను ఎక్కడెక్కడికి తిప్పినా ఒంటిగంట వరకే. ఆ తరువాత తనకి పనుందని వెళ్ళిపోయేది. ఎట్టి పరిస్థితులలోను మధ్యాహ్నం పూట దొరికేది కాదు. "రోజా ఎక్కడికి పోతుందే మధ్యాహ్నాలప్పుడూ?" అని మా అమ్మాయినడిగితే 'దానికి ఊరినిండా చుట్టాలే నీకు మల్లేనే" అని ఒక ఆదరాబాదరా జవాబిచ్చింది.

ఒకరోజు సాయంత్రం పూట వాళ్ళ ఊరెలా ఉంటుందో చూపిస్తానని రెండు మూడు కాలనీలు తిప్పింది. అప్పుడప్పుడే పొద్దు కూకుతోంది. ప్రతి ఇంట్లోనూ గాజు అద్దాల కిటికీల వెనక క్రొవ్వొత్తుల్లా మినుకు మినుకుమని వెలిగే కరెంటు దీపాల నమరించి ఉంచారు. (మనం దీపావళినాడు గూట్లో దీపాలు పెడితే అక్కడ రోజూ అదే పనన్నమాట) ప్రతి ఇంట్లోంచీ ఆ దీపాలు వెలుగుతూ, ఆరుతూ ఎంతో దివ్యంగా కనిపిస్తూ చీకట్లో కూడా ఆ ఇంటి ఆకారాల్ని చక్కగా చూపిస్తున్నాయి.

తిరిగి ఇంటికి వచ్చాక మా అమ్మాయితో "మీ ఊరు ఎంత బావుందో. ఏదో కలొచ్చినట్లుంది. కారెన్ అదృష్టం చూడు. అమీర్‌పేటలో అత్తారిల్లూ, చిక్కడపల్లిలో పుట్టిల్లూ, హిమాయత్‌నగర్‌లో తన ఇల్లూ ఉన్నట్లున్నాయి. ప్రతి శనివారం కలుసుకుంటారటగా" అన్నాను.

'ఆఁ కలుసుకుంటూనే ఉంటారు! మళ్ళీ కొట్టుకుంటూనే ఉంటారు. తనకి కొన్నాళ్ళు అమ్మతో పడదు. ఇంకొన్నాళ్ళు అత్తగారితో పడదు. చుట్టాలందరికీ గొడ్డు చాకిరీ చేసి ఏదో ఒకటి అని పడి పడుతుంటుంది" అని తన ఫ్రెండు గురించి బాధపడింది.

"అయిన వాళ్ళంతా ఒకే ఊళ్ళో ఉంటే ఆ మాత్రం మాట తేడాలొస్తాయి మరి. ఏ అమ్మా నాన్నలకైనా పిల్లలు కళ్ళ ముందుండాలంటే పెట్టి పుట్టాలి.

ఏ తరంలోనూ మన వాళ్ళనుభవించని క్షోభ మాతరం తల్లిదండ్రులనుభవించాల్సి వస్తోంది. ఎదురుగా ఉండి బాధలు పడుతుంటే చూడలేక ఎక్కడికో పోయి సుఖంగా బతకండ్రా అని తోలేస్తున్నాం. ఈ పిల్లలూ అంతే. ఐసరబజ్జా అనుకుని పోయిన వాళ్ళు అదేపోత! పూర్వం మహాపరాధాలు చేసిన వాళ్ళకి దేశాంతరవాస శిక్ష వేసేవారుట. ఇప్పుడా శిక్ష అమ్మలే వేస్తున్నారు. పోనీలే మీరెవరూ పిల్లల్ని దూరాలు పంపుకోనక్కరలేదు! అమెరికా కన్నా డబ్బున్న దేశం ఉండదు కదా."

ఏదో చదువుకుంటున్నది తలెత్తి నాకేసి చూసేటప్పటికి కోపంతో ఆ పుస్తకం నా మీదకి గిరాటేస్తుందేమోనని భయంవేసి అప్పటికి నోరు మూసుకున్నాను.

ఒక రోజు రాత్రి భోజనాలైపోయాక అందరం కూచుని ఏవో కబుర్లు చెప్పుకుంటుండగా ఫోటో ఆల్బంలు తెచ్చి నా ముందు పడేసింది మా అమ్మాయి. మా మనవరాలి మొదటి పుట్టిన రోజు ఫోటోలు చూస్తున్నాం. చాలా ఫోటోల్లో కారెన్ నవ్వుతూ తన పిల్లలిద్దరితో నిలబడి ఉంది కానీ ఆ అమ్మాయి తల మీద ఒక్క వెంట్రుకన్నా లేదు. శరీరం, తలా ఒకే రంగులో నిగనిగలాడుతున్నాయి. ఒక వేళ అదీ ఒక ఫాషనేమోననుకున్నాను.

"మా దేశంలో షబానా అజ్మీకి పట్టిన పిచ్చి ఇక్కడకూడా పాకిందేవిటే" అని అడిగాను.

"ఫాషనూ కాదు, ఏం కాదు. ఆ మధ్య కీమోథెరపీ చేయించుకుందిలే! ఇప్పుడు బాగానే ఉందిగా! నీ కెందుకిన్ని ఆరాలు?"

"తను కీమోథెరపీ చేయించుకోడమేమిటీ? అదేవన్నా బ్యూటీ ట్రీట్మెంటా? కాన్సరు పేషంట్సుక్కదా అది చేసేది?" అప్పటికే నా గొంతు మనసు కళ్ళు కంట్రోలు తప్పుతున్నాయి.

"ఇదుగో! ఇలా గొడవెడతావనే నీకు చెప్పలేదు! దాని రెండో కూతురు పుట్టినప్పుడు పాలివ్వబోతే తెలిసింది. ఒక్క నెల తేడాతో రెండు బ్రెస్ట్సు ఆపరేషన్ చేసి తీసేశారు. ఏడాదిపాటు రకరకాల ట్రీట్మెంట్లిచ్చారు. ఇప్పుడంతా తగ్గిపోయి అందరిలా నార్మల్గా ఉంది. కాకపోతే మూడు నెలలకోసారి చెకప్కి వెడుతుంది. ఆ ఉపద్రవాన్ని మొగుడూ పెళ్ళాలెంత ధైర్యంగా ఎదుర్కొన్నారో. మన దేశంలో అయితే తెలిసికొంతా, తెలియక కొంతా చేయవలసిన పనులు చేయకుండా నానాగోలా చేసుకుంటారు. ఇద్దరు పిల్లల్ని చూసుకుంటూ ఆ

ట్రీట్‌మెంటంతా తీసుకుంది. నువ్వడిగే దానివిగా రోజూ ఎక్కడికి పోతుందని? కాన్సర్ పేషెంట్స్‌కి కౌన్సిలింగ్ చేస్తుంది. టర్మినల్ పేషెంట్స్‌కి వెళ్ళి కబుర్లు చెప్పి సేవలు చేస్తుంది. వారానికి రెండు రోజులు ఆర్ఫనేజిలో పనిచేస్తుంది. స్వయంగా తను అంత నాజూకు పరిస్థితిలో ఉండి కూడా ఇంకొకరి కోసం చేతనైనంత సహాయం చేస్తుంది. నువ్వు హైదరాబాద్‌లో కూచుని ఇక్కడి వాళ్ళ గురించి తేలికగా మాట్లాడే దానివి. మంచి వాళ్ళెక్కడైనా ఉంటారు" అని చెప్పింది.

"ఊఁ సర్లే ప్రతి దానికీ నన్ననడం నీకలవాటైపోయింది. ఇక్కడందరూ చెడ్డవాళ్ళని నేనెప్పుడన్నాను!"

"ఇదిగో అమ్మా చెప్తున్నాను. తనతో ఈ విషయం ఎత్తకు. ఇన్నాళ్ళూ ఎలా ఉన్నావో ఇప్పుడూ అలాగే ఉండు. లేనిపోని జాలి చూపించి తనని బాధపెట్టకు. అమ్మమ్మ చెప్పేది కాదూ. 'అయ్యోపాపం అనకండే! అరవై వేల పాపాలొస్తా యనీ! అంత పెద్ద ఉపద్రవాన్నుంచి బయటపడి ఆరోగ్యంగా తిని తిరుగుతూ తనలాంటి వాళ్ళకి ఇంకో పది మందికి సహాయం చేసిపెట్టే ఆ అమ్మాయి గురించి భయంకరంగా ఊహించుకుని బుర్రపాడు చేసుకోకుండా నిద్రపో! గుడ్‌నైట్" అని మా అమ్మాయి దాని గదిలోకి వెళ్ళిపోయింది. నిజమే కదా! జీవించడానికి పోరాటం చేస్తూ కూడా పది మందికీ సంతోషాన్ని పంచుతున్న మంచి వ్యక్తి గురించి అనవసరపు బెంగలు పెట్టుకునే అధికారం నా కెవ రిచ్చారు?

-పత్రిక, ఏప్రియల్ 2009

✦ ✦ ✦